# అర్థంకాని మనిషి

రచన:
శ్రీ తుమ్మల దాదా రెడ్డి

ఎటుచూసినా జీవితపోరాటం. ప్రతివారిలోనూ ఏదో ఆరాటం. గుమ్మం బయట నిల్చున్న గుమ్మం చూపులతో తికమకపడుతున్నారు దారిన వెళ్ళేదానయ్యలు. నేనిక మీ మొఖం చూడనన్నట్లు రవి కన్ను మూసుకుని ఆకాశంలోకి వెళ్తున్నాడు. ఎన్నెన్నో కలలుగని చివరకు పెళ్ళిమధ్య ఇరికిన రాము ఏదో ఉత్తేజంతో నూతన ఉత్సాహంతో ఆఫీసునుండి అడుగుబయట పెట్టగనే ఈదారి తొక్కాడు. వీదినంతా కలయజూస్తున్నా కనుల్లో మెరిసేది కోవర్కర్ రాజు గృహమే.

రాజూ! రాజూ! అంటూ మూడుమార్లు తలుపు తట్టినా జవాబు రాలేదు. సమాధి అయిన ఆలోచనలు ఒక్కమారే కుక్కగొడుగుల్లా లేచాయి. రాజు హైదరాబాదునుండి రాలేదేమో! ఆశ, రాధ ఇంట్లో ఏం చేస్తుందో! తాపత్రయం. ఇరుగుపొరుగునను జూసి ఏమనుకుంటున్నారో! భయం గొళ్ళెం చప్పుడు ఆగిన మరుక్షణంలోనే నాజూకు అడుగుల చప్పుడు రాము గుండె తడబడిందప్పుడు. సూటిగా చూసింది గుండెలకు తాకేట్టు. స్వీట్ గా చూసింది లోనికిరమ్మన్నట్టు, రాధను చూస్తే మధుర బాధ.

రాజు ఇంకా హైదరాబాదునుండి రాలేదా? ఇంటిలోకి వెళ్తూనే అడిగాడు రాము.

రాలేదని మీకు తెలియదా ఆఫీసునుండి రావడం లేదా!

నేను ఆఫీసునుండే వస్తున్నా రాజు ఇంటికి వచ్చాడేమోనన్న అనుమానంతో వచ్చాను.

ఎందుకు వచ్చారని నేననలేదు గదా? రాధ కొంటెది. మాటల్లో, చూపుల్లో, నడకల్లో ఏవో మాయలు వొదిగివుంటాయి.

అదికాదండీ! ఉబుసుపోక ఇలా వచ్చాను రాజు లేకపోవడంచే నాకు చాలా బోర్ గావుంది.

ఈ డొంక తిరుగుడు మాటలంటే నాకు చిరాకు. సీత లేకపోవడంవల్ల బోర్ గావుందని చెప్పేందుకు సిగ్గు లేక ఇది మగజాతి రివాజా!

అమ్మో! అంతర్జాతీయ మహిళా సంవత్సరపు ఆసరు ఇంకా పోలేదుగా! నీతో ఏం మాట్లాడాలన్నా భయం అసలు నీతో మాట్లాడకపోవడమే ఎంతో నయం.

ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి, ఇల్లాలే ఈ జగతికి జీవనజ్యోతి ప్రక్కింటి రేడియో గొంతెత్తి పాడుతోంది. ఈ పాట నాకు చాలా నచ్చింది అని చెప్పాలనుకున్న రాము తప్పక ఊరుకున్నాడు మాట్లాడితే మరే ప్రళయం ముంచుకొస్తుందోనని.

ఏం మాట్లాడరు? పాట వింటున్నారా పరధ్యానంలో ఉన్నారా లేక సీతక్క గుర్తొచ్చి మెదడు తిమ్మిరెక్కిందా?

నీ ప్రశ్నలకు సమాధానమిచ్చే ఓపిక లేదు.

'చేవ ఉంటేకదా ఓపిక ఉండడానిక్కి' కిలుక్కుమని నవ్వింది.

మగమనసు మరిగిపోయింది. కసితో బుసకొట్టింది కుబుసం విడిచిన నాగులా. తిరుగుబాటు చేయమని అంతరాత్మ ఉక్రోశించింది. రాధా నీకు నీవు మాట్లాడుతున్న మాటల అర్థం తెలుసా అని?

అంటే... చేవ అంటే నాకు తెలియదనేనా.

అదికాదు. ఎంత చాతుర్యమున్నా మీరు కాంతలే మా చరణదాసులే మా చేవను ఎంచే శక్తి మీకులేదు.

పోనీయండి మీ చేవను ఎంచే శక్తి లేకున్నా మీ చేవను మించిన శక్తి ఉందని ఒప్పుకుంటారా?

మళ్ళీ ఓ చెంపదెబ్బ తట్టుకోలేకనే ప్లేటు ఫిరాయించాడు. రాధా ఇక రివర్స్ గేర్ వెయ్యి కాస్తా కాఫీ యివ్వు.

అలా రండి దారికి అంటూనే లోనికెళ్ళి కాఫీ తెచ్చి యిచ్చింది.

రాధా నీవు వయసులో ఎదిగినా చిన్ననాటి చిలిపితనం పోలేదు. నీ జీవితం ఎప్పుడూ ఇలాగే సాగాలని మనసారా వాంఛిస్తున్నాను.

రామూ! నాకీ నరకం వద్దు. నాకీ జీవితం దుర్భరమనిపిస్తుంది, నాకే సుఖమూ లేదు, వారికేమైనా

ఎల్లప్పుడూ...




సిల్వర్ స్టార్

బనియన్లనే ఉపయోగించండి.

: తయారించువారు :

Silver Star Hosiery Mills
TIRUPUR – 638601.

ఫైళ్ళూ, ఆఫీసేకాని పెళ్ళాం, ఇల్లూ అవసరంలేదు నన్ను నమ్ముకొన్న పెళ్ళాం అనేదొకటి ఉంది దానికి కాస్తో కూస్తో కోరికలనేవి ఉంటాయన్న ధ్యాసేలేదు సినిమాకు వెళ్దామా అని ఆశతో అడిగితే వీలుపడదు పక్కింటి పార్వతితో వెళ్ళు ఇదిగో పది రూపాయలు అంటారు. వింతమనిషి తనదోరణి తానె ఏదిఏమైనా ఇలాంటి సంసారాన్ని ఈదడం బహుకష్టం.

ఎందుకు రాధా నీవిలామాట్లాడుతావ్? వ్యక్తి మంచి వాడు రెండు చేతులా సంపాదిస్తున్నాడు నీకేం మహా రాణిలా దర్జాగా గడపవచ్చు.

అంతా అలాగే అనుకుంటారు 'లోగుట్టు పెరుమాళ్ళ కెరుక' నావ్యధ మీకర్ధం కాదు, అంతస్తు ఐశ్వర్యం ఇవన్నీ మనిషికేకాని మనసుకుకాదు, ఎవరికైనా కావల్సింది ఇవన్నీకావు, ఒక ఆత్మశాంతి చాలు, కానీ ఎవరేకాని కోరుకునేది అంతస్తులనూ ఐశ్వర్యాలను వీటిలోనె సర్వం ఉన్నాయని భ్రమిస్తారు. ఈ బ్రమే మనుషుల్ని దారి తప్పిస్తుంది, చేతులుకాలాక ఆకులందుకుంటే ఏం లాభం! చెఱువులోని నీరు చెఱువెనుక పడ్డాక చెసేదేముంటుంది.

రాధా ఏమిటీ వేదాంతం?

ఇది వేదాంతంకాదు రామూ నా అనుభవంలో తెలుసుకొన్న నగ్న సత్యం,

నీవెన్నైనా చెప్పు, మనిషిది పాడుతత్వం ఉన్న దానిని కాలదన్నడం లేనిదానికై తపించడం మానవ నైజం.

అది నీ భావన, నా ముఖంచూసి చెప్పు నేను చిన్న నాటిలాగే వున్నానా?

నేనేం చెప్పాలి, ఎలా చెప్పాలి, చెప్పాలనుకున్నది చెప్పలేని స్థితి నాది. మనసులో ఎన్నో ఉన్నా నాలకకు అందవు. మొదటిలో నేనూ నీలాగే చాలా కలలు కన్నాను, కలలు నిజంకావు. పరిస్థితులు ప్రతికూలిస్తే ఆశలూ, ఆశయాలూ అన్నీ అడుగంటుతాయి. సర్దుబాటు తత్వాన్ని అలవర్చుకొని నాడు ఈమాత్రం శాంతికూడా ఉండదు.

ఇవ్వాళ మనసు బాగుండటంలేదు. ఏదైనా సినిమాకు పోదామా తలనొప్పిగా ఉంది. ఎందుకులే—

ఇంటిలో నిరీక్షిస్తూ కూర్చుండే సీత ఇవ్వాళ్ళ లేదుగా?

అందుకనిగాదు అన్నీ చూసినవే.

అయితే మళ్ళీ చూడరాదా?

ఎందుకు చూడరాదు కాని...

హల్లో రామూ! అంతా క్షేమమేనా?

ఆఁ! పోయినపని అయ్యిందా, నీకొరకే వచ్చాను. ఇక రావేమో అనుకున్నా.

ఆఁ పని అయ్యేసరికి నా తల ప్రాణంలోకి వచ్చింది.

మా అక్కయ్యవాళ్ళింటికి వెళ్ళారా? రాధ.

టైం దొరికితేకదా.

అవునవును. మరచేపోయాను మీకు మావాళ్ళతో కలవడానికి టైం సరిపోదుకదూ!

ఏమిటి నీ వేళాకోలం. రాగానే వెంటపడ్డావ్.

రాధ నిట్టూరుస్తూ లోనికెళ్ళింది బాధగా.

రాజూ శేనిక వెళ్తా, ఉదయం ఆఫీసుకి వస్తావుగా.

తప్పదుగా.

వెళ్ళొస్తా...గుడ్ బై...

గుండెనిండా గమ్మత్తయిన యోచనలు. మనిషి

ఎంతో ఎదిగిపోయాడు, ఎన్నో మహత్తర కార్యాలు సాధిస్తున్నాడు గ్రహాలపై విహరిస్తున్నాడు, కాని మగువ మనసు తెలుసుకునే శక్తిని కూడదీసుకోలేకపోతున్నాడు, ఏదైనా యంత్రం కనిపెట్టితే బాగుండు. ఇదంతా రాము యోచన. వింత తలపులలోనే స్వంత ఇంటి తలుపులదాకా చేరాడు. సెవెన్ లీవర్స్ తాళం వేసి హెవెన్‌నుండి నరకంలోకి పోతున్నట్లు లోనికి నడిచాడు.

తెల్లకవరొకటి కొట్టొచ్చినట్లు అగుపడింది. గబగబ విప్పాడు. 'నేను మరో వారంరోజుల్లో వస్తా! మీకు హోటల్ భోజనం పడదు స్వయంపాకం చేసుకోండి' అన్న సీత ఆదేశాన్ని మోసుకొచ్చింది ఆత్రంగా చదివిన ఆ ఉత్తరం. నా ఖర్మ బాగులేకనే ఇదొకటి దాపురించింది, ఇప్పటికే పదిహేను రోజులయ్యింది ఇంకా వారం? బెంగతోనే బంగళా ఎక్కాడు, ఆకలి చచ్చింది, ఆలోచన హెచ్చింది, పరుపు డాబాపై వేసుకుని నిశ్చలంగానిర్మలంగానున్న ఆ వాతావరణంలో శవాసనం వేసాడు రాము. పరిపరి విధాలా సాగుతున్నాయి, ఆలోచనా పరంపరలు.

దాగుడు మూతలాడుతున్న నక్షత్రాలు చూస్తుంటే చిన్ననాడు రాధతో ఆడుకొన్న దాగుడు మూతలాట గుర్తొస్తుంది రాముకు, వాతావరణం చల్లగానున్నా మనసుమాత్రం వేడిగానే ఉంది. హైస్కూల్ దాకా కలిసి చదివిన రాధ ఈనాడు మిత్రుని భార్యగా వున్నా ఆ చిన్ననాటినుండీ ఎదలో మరో రూపంగా నిద్రిస్తూనే వుంది. అపుడపుడు కలుసుకున్నా కలుసుకుంటాడు, వీలుకాకపోతే కలలోనైనా ఒక మనిషిపై ఏదైనా అభిప్రాయం కలిగిందంటే అదిమాయడం కష్టం.

రాధ నాగూర్చి ఏమనుకుంటుందో! నేనెంత సేపు మాట్లాడినా ఇంకొంత సేపు మాట్లాడితే బాగుండన్నట్లు చూస్తుంది. నానుండి ఆమె ఏం కోరుకుంటుంది. నేను కోరుకున్న దేముంది నాలాగే ఆమె అనుకోవడానికి ఏమో విచిత్ర పరిస్థితులు.

ఇవ్వాళ నాతో మాట్లాడిన మాటల్లో ఏదో చెప్పాలన్న బాటను కప్పి చెప్పినట్లు తోస్తుంది. నేను ఊహించిన మాటను నిర్ధారణ చేసుకోవడం సబబేనా?

నేననుకునేదే నిజమైతే మొన్న ఒకసారి నేను కాస్త వంకరగా (నా ఊహలకనుగుణంగా) మాట్లాడితే సమాధానం చెంప దెబ్బచరిచినట్లు యిచ్చింది. ఆ మాట మరువలేను. 'మనుషుల్ని అర్థంచేసుకునే జ్ఞానం అందరికీ ఉందనుకోవడం నాదే పిచ్చితనం' ఈమాట నా ఊహల్ని చంపుతుంది, రాద ప్రవర్తనేమో నా ఊహల్ని రేపుతుంది. నాలో మనుష్యుల్ని అర్థంచేసుకునే జ్ఞానం లేదా! నేను రాధను తప్పుగా అర్థంచేసుకుంటున్నానా! ఈ సంఘర్షణలో చిక్కుకున్న రామును నిద్రాదేవి తనవైపు లాక్కుంటోంది. నిద్రాదేవి ఒడిలోకి జారిపోతున్న రాముకు రాధ అర్థంకాని మనిషి...!

---

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు: రచయితల రచనలకు మేము ఏమాత్రమూ బాధ్యులుకాదు. —సంపాదకుడు.

---



భరణీవారి 'మనవడి కోసం'' చిత్రంలో పద్మశ్రీ భానుమతి.